తంబళపల్లెలో అభివృద్ధి తళతళ

- ఊరూరా తారు రోడ్ల నిర్మాణం
- ఆర్‌బీకేలు, సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు
- సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి
- రూ.3.30 కోట్లతో మల్లయ్యకొండపై ఆలయ పునఃనిర్మాణం
- చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి





మల్లయ్యకొండ ఆలయం వ్యూ (ఇన్‌సెట్) కొండపై పునఃనిర్మించిన ఆలయం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

తంబళ్లపల్లె : స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి ఎన్ని ప్రభుత్వాలు, పాలకులు మారిన అభివృద్ధికి ఆమడ దూరంలోనే తంబళ్లపల్లె నిలిచింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. భక్తులను అలరింప చేస్తున్న మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని రూ.3.30 కోట్లతో పునఃనిర్మించారు. మరో రూ.1.13 కోట్లతో వినాయక గుడి, ఆంజనేయస్వామి గుడి, వెలుగుమల్లమ్మ ఆలయం, గౌరమ్మ ఆలయాల పునఃనిర్మాణాలు జరుగుతున్నాయి. రూ.9.02 కోట్లతో మల్లయ్యకొండకు రోడ్డు సౌకర్యం కల్పించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తుల రావడంతో ఆలయ ఆదాయం పెరిగింది. మహాశివరాత్రి మూడు రోజులు ఉత్సవాలు జరుగుతాయి. అన్నదాన కమిటీ సభ్యులు లక్షల మంది భక్తులకు అన్నసంతర్పణ చేస్తారు.

సచివాలయాలతో ఇంటి ముంగిటికే పాలన

గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తు గ్రామ సచివాలయాల నిర్మాణంతో ప్రజల ముంగిటకే పాలన వచ్చింది. మండలంలో రూ.5.14కోట్లతో 12 గ్రామ సచివాలయాలను నిర్మించారు. ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్న గ్రామంలోనే సచివాలయ ఉద్యోగుల ద్వారా సకాలంలో ప్రజలకు అందిస్తున్నారు. అన్ని రకాల సమస్యలను ఇక్కడే పరిష్కారమవుతున్నాయి.

రైతుకు అండగా రైతు భరోసా కేంద్రాలు

రైతే రాజు అన్న చందాన రైతులకు అండగా ఉండి అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలో రూ.2.40 కోట్లతో 11 కేంద్రాల నిర్మాణాలు చేశారు. రైతులకు వ్యవసాయశాఖ అధికారుల ద్వారా వ్యవసాయ రంగంపై పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, మందులు రైతులకు అందజేయడం జరుగుతుంది.

డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధి

గ్రామీణ ప్రజల ఆర్థిక స్వావలంభన కోసం పలు రకాల సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో రూ.69,078 మంది లబ్ధిదారులకు రూ.207.82కోట్లు నేరుగా వారి ఖాతాలో ఈ ప్రభుత్వం జమ చేయడం జరిగింది. నాన్ డీబీటీ పద్ధతిలో 19,679 మంది లబ్ధిదారులకు రూ.48.42కోట్లు ఖర్చు చేశారు. దీంతో ప్రతి కుటుంబంలో జీవన ప్రమాణాలు పెరిగి ఆర్థిక అభివృద్ధితో సంతోషంగా ఉన్నారు. అవ్వా,తాతలు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ పథకాన్ని అమలు పరుస్తోంది. ఈ పథకం ద్వారా ప్రతి నెలా 6310 మంది లబ్ధిదారులకు రూ.1.87కోట్లు ఖర్చుచేస్తోంది.

పల్లె పల్లెకు రోడ్డు సౌకర్యం

రోడ్డులేని పల్లె ఉండకూదన్న ఆశయంతో 269 రోడ్లును రూ.11.06కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మదనపల్లె, తంబళ్లపల్లె రోడ్డు నుండి కదిరి ప్రధాన రోడ్డు వరకూ 16కిలో మీటర్లు రూ.8.6కోట్లతో నిర్మాణం జరిగింది. ఎప్పుడూ రోడ్డులేని మూడు మండలాలోని 50 పల్లెలకు ఈ రోడ్డు ఏర్పాటుతో సౌకర్యం కలిగింది. మండలంలో మరో 84 ఇంటర్నల్ రోడ్లు, 73.84కోట్లతో ఏర్పాటు చేశారు.

మెరుగైన వైద్యసేవలు

గ్రామీణ నిరుపేదలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మండల కేంద్రంలో రూ.4.65 కోట్ల ఖర్చుతో సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని నిర్మించారు. అధునాతన సౌకర్యాలతో పాటు వైద్యనిపుణులతో సేవలు అందిస్తున్నారు.

రైతులకు సింగిల్‌విండో బ్యాంకు

రైతులకు అన్ని రకాల రుణ సౌకర్యాలు కల్పించేందుకు రూ.53 లక్షల ఖర్చుతో సింగిల్‌విండో బ్యాంకు భవనాన్ని నిర్మించారు. ఇక్కడ రైతులు దీర్ఘ, స్వల్పకాలిక పంట రుణాలతో పాటు షేవింగ్స్, బ్యాంకు లాకర్ సౌకర్యాలు కల్పించారు.



గోపిదిన్నె గ్రామ సచివాలయం



నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం



సింగిల్‌విండో భవనం



మర్రిమాకులపల్లెకు ఏర్పాటు చేసిన తారురోడ్డు

క్లుప్తంగా

ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌తో ఉజ్వల భవిష్యత్
– డీఆర్‌డీఓ సైంటిస్టు రామ్‌సింగ్



జ్యోతి వెలిగిస్తున్న రామ్‌సింగ్

కురబలకోట : ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌తో మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ డీఆర్‌డీఓ సైంటిస్టు రామ్‌సింగ్ అన్నారు. మంగళవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి సింపోయిజం ఎక్లిటిక-24 నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంవైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు దేశంలో పేరుగాంచిన కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఆర్‌డీఓలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఇస్రో, హెచ్‌ఏఎల్ వంటి సంస్థల్లో మెరుగైన పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా ఉన్నాయన్నారు.

తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



వజ్రవాక్యాల పుస్తకాన్ని అందజేస్తున్న ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది తెలుగు క్యాలెండర్‌ను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిస్సార్ అహ్మద్ ఆవిష్కరించారు. క్యాలెండర్‌తో పాటు వజ్ర వాక్యాల గ్రంథం అందజేశారు. క్యాలండర్‌లో తెలుగు తిథులు, ఆంగ్ల తేదీలను పొందుపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు బాలం లక్షిమ, నరసింహులు,ధనుంజయ, లత, చాముండేశ్వరి, నారాయణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సచ్ఛరిత్ర ప్రవచనాలు

మదనపల్లె సిటీ : స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ కృష్ణా కళ్యాణ మండపంలో మంగళవారం శ్రీ షిరిడి సాయిబాబా సచ్చరిత్ర జ్ఞానయజ్ఞ సప్తాహ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. శ్రీశైలం సాయిదాస్‌చే ప్రవచనాలు వినిపించారు. బాబా హారతులు, విశిష్టత, సత్సంగం గురించి తెలియజేశారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు రెడ్డప్ప తెలిపారు. సాయి భక్తులు హాజరు కావాలని కోరారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు కవిత మన్నికేరి

తంబళ్లపల్లె : అందరూ ఎన్నికల నియమావళి పాటించాలని అసెంబ్లీ ఎన్నికల పరిశీలకురాలు కవిత మన్నికేరి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు వైభవ్‌శుక్లా ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ నాయకుల చిత్రాలు, అభ్యర్థులు ఇండిపెండెంట్ అభ్యర్థుల గుర్తులు కూడా ఉండరాదన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఈఆర్వో రాఘవేంద్ర, ఏఈఆర్వో బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామసముద్రం : మండలంలోని మానేవారిపల్లె పంచాయతీలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున గ్రామ గ్రామాన బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, అరికెల , మానేవారిపల్లి పంచాయతీల్లో అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ చేశారు. సచివాలయం కన్వీనర్‌లు రమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, హరినాథరెడ్డి, వెంకట్రమణ, రమణారెడ్డి, చిన్నప్పరెడ్డెప్పరెడ్డి, భాస్కరచారి, పద్మావతమ్మ, గాయిత్రి, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడం బాబు నైజం



ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్

- జగనన్న చేసేదే చెబుతాడు
- మదనపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్
- వెంగం వారి పల్లె, సామకోట వారి పల్లె పంచాయతీలలో ఎన్నికల ప్రచారం

నిమ్మనపల్లె : ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని, అబద్ధపు హామీలతో గద్దెనెక్కాలని చూస్తున్నాడు. రానున్న ఎన్నికల్లో ఆయనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మదనపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సదాశివరెడ్డి, వెంగంవారి పల్లె సర్పంచ్ జి. శ్రీవాణి , రుకియా బేగం సామకోటి వారిపల్లె సర్పంచ్ మహదేవ రెడ్డి, ఆధ్వర్యంలో వెంగం వారి పల్లె పంచాయతీలోని వెంగంవారి పల్లె, సఖింబం డవారి పల్లె, బాలినాయన పల్లె, సామకోటవారి పల్లె పంచాయతీలోని సామకోటవారి పల్లె, ఎర్రంవారిపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్న టీడీపీకి, ఇవే చివరి ఎన్నికలు కావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేయగలిగింది మాత్రమే చెబుతారని, చెప్పింది తప్పకుండా చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలోనే ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రకటించిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రజల్లో జగనన్నపై నమ్మకాన్ని పెంచిందన్నారు. కూటమి పార్టీలు ప్రకటిస్తున్న హామీలు అమలు చేయడం సాధ్యం కాదన్నారు. జగనన్న పరిపాలనలో ప్రతి ఇంటికి వివిధ పథకాలతో లక్షల రూపాయల లబ్ధి చేకూరిందని అన్నారు. ఎన్నికల్లో మదనపల్లి ఎమ్మెల్యేగా నిస్సార్ అహ్మద్‌ను, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డి శేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి,ఆర్ ఐ రమణారెడ్డి, ఎల్ రఘునాథరెడ్డి, ఆర్ బి కె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, ఉషారాణి, రామ మోహన్ రెడ్డి, నవాజ్, నాగరాజా, ఖాదర్ భాష, హోటల్ రఫీ, బొట్టు రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భర్త గెలుపుకోసం భార్య ప్రచారం

రామసముద్రం : వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ గెలుపు కోసం ఆయన భార్య తస్మీమ్ కుమారుడు హామీద్ రామసముద్రం దిగువపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా పథకాలు, మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నిస్సార్ అహమ్మద్ , ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని వారు కోరారు. నియోజకవర్గం, మండల అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు మన దగ్గరకు చేరాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. వారి వెంట ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్‌గౌడు, ఎంపీటీసీ మస్తాన్, ఉపసర్పంచ్ తపాల మస్తాన్, పాలబత్తుల సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నందరెడ్డి, జెసి ఎస్ కన్వీనర్ ప్రకాష్, బడ్లప్రభాకర్, మాలిక్, చికెన్ బాబు, మహబూబ్‌బాషా, దర్శన్, బాబా, రహమ్‌తుల్లా, సచివాలయం భాస్కర్, ఉదయ్, సమి, జబి, షఫీల్ ఇమ్రాన్, సోము, హరి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.



రామసముద్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నిస్సార్‌అహమ్మద్ భార్య, తనయుడు

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి



జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్

మదనపల్లె : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పట్టణ జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొగటవీరక్షత్రియ కులస్థుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ మిథున్‌రెడ్డి చేనేత కార్మికులకు భరోసా కల్పించడంతో అందరిలో నూతనోత్తేజం కలిగిందన్నారు. 2014లో తొగటవీర క్షత్రియ కులస్థులు 70 శాతానికి పైగా టీడీపీకి మద్దతు తెలిపారని, 2019లో వారంతా బేషరతుగా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపి నీరుగట్టువారిపల్లెను పార్టీకి కంచుకోటగా మార్చారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి నేతన్ననేస్తం, చేనేత పెన్షన్ తదితర అనేక సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. ఈ విధంగా గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదని, జగనన్న పాలనలోనే సాధ్యపడిందన్నారు. ఈ విషయాన్ని ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి వివరించడమే కాకుండా, టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని వివరించాలన్నారు.

ఏఎస్‌ఐ రెడ్డెప్ప సేవలు అభినందనీయం
– డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె : పోలీసుశాఖలో 40 సంవత్సరాల పాటు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులను నిర్వహించిన ఏఎస్ఐ రెడ్డెప్ప సేవలు అభినందనీయమని డీఎస్పీ ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం టూటౌన్ సీఐ యువరాజ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఏఎస్ఐ రెడ్డెప్ప పదవీ విరమణ సమావేశానికి డీఎస్పీ ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అనేక ఒత్తిడులు, మానసిక సంఘర్షణలతో కూడుకున్నదని, నిబద్ధతతో, నిజాయితీతో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. 40 ఏళ్లపాటు ఉద్యోగ జీవితాన్ని ఒడిదుడుకులు లేకుండా సంతోషంగా నెట్టుకువచ్చిన ఏఎస్ఐ రెడ్డెప్ప అనుభవాలను విధి నిర్వహణలో సిబ్బంది తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రెడ్డెప్పను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐలు ఇమామ్‌సాహెబ్, వై.వి.రమణ, చంద్రయ్య, బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎస్ఐ రెడ్డెప్పను సన్మానిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, టూటౌన్ సీఐ యువరాజ్, సిబ్బంది

ఓటింగ్‌శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలి

- హోం ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి
- నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిప్రసాద్



మదనపల్లె : నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకున్నప్పుడే ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆర్వో హరిప్రసాద్ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో బీఎల్వోలకు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు హోం ఓటింగ్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతి ముఖ్యమైనదని, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు నిస్సహాతతో ఓటు వేయలేకపోతున్నారని గుర్తించిన ఎన్నికల సంఘం వారు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా హోం ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానం ఇప్పటికే తెలంగాణ ఎన్నికల్లో వినియోగించారని, ఏపీలో పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించడం తొలిసారిగా పేర్కొన్నారు. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో... 80 ఏళ్లుపైబడిన వృద్ధులు...21మంది, 40 శాతానికి పైగా వైకల్యత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులు...31 మంది ఉన్నారన్నారు. వీరి చిరునామాలను సేకరించామని, జిల్లా ఎన్నికల అధికారి షెడ్యూల్ ప్రకారం పోలింగ్ ఆఫీసర్, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్, బీఎల్వో బ్యాలెట్ తీసుకుని వెళ్లి, గోప్యత పాటిస్తూ, వృద్ధులు, విభిన్నప్రతిభావంతుల నుంచి రహస్య ఓటింగ్ వేయిస్తారన్నారు. సాధారణ ఎన్నికలు–2024లో మదనపల్లె అసెంబ్లీనియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థుల జాబితా ఖరారైందన్నారు. బ్యాలెట్‌ను ఈవీఎంలో అమర్చేందుకు, పోస్టల్ బ్యాలెట్‌కు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో బాలాజీరాజు, రమాదేవి, కే.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రభుత్వ కాలేజీలో చదివి మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఎంపీసీ విద్యార్థిని తహరా సమర 979 మార్కులు సాధించి ప్రభుత్వ కాలేజీలో జిల్లాలోనే మొదటి స్థానం సాధించడం గర్వకారణమన్నారు. ప్రభుత్వ కాలేజీలో మంచి నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఇంటర్‌లో ప్రతిభ సాధించిన తహర సమర, గీతామాధురి, సమరా కౌసర్, నబియా కౌసర్, మల్లీశ్వరి, గరిష్మాలకు రూ.500 ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యశేఖర్‌రెడ్డి, భవానీదేవి, వనజ, విష్ణుప్రియ, మోహన్‌వల్లి, జ్యోతి, నమ్రత తదితరుల పాల్గొన్నారు.



ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి